ప్రజాశక్తి
బుధవారం 22 జనవరి 2025
5
శ్రీకాకుళం

ఎండియు ఆపరేటర్లపై అసత్య ఆరోపణలు

శ్రీకాకుళం అర్బన్ : నెల్లూరు జిల్లాలో డీలరు మృతికి ఎండియు ఆపరేటర్లే కారణమని ఆపాదించడం తగదని ఎండియు ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోం ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆపరేటర్ల వ్యవస్థ వల్ల డీలర్ల సంఘానికి గానీ, డీలర్లకు గానీ కలిగే నష్టమేంటని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షులు సుదర్శనరావు అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. నెల్లూరు డీలరు మృతికి ఎండియు ఆపరేటర్ వేధింపులు వాస్తవమైతే, ఆయనపై చర్యలు తీసుకోవడంలో తప్పు లేదన్నారు. అంతేగానీ ఎండియు వ్యవస్థనే తప్పుపట్టడం సరికాదన్నారు. సమావేశంలో ఆపరేటర్లు అప్పారావు, శివప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంకితభావంతో విధులు నిర్వర్తించి నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం, ప్రత్యేక కార్యాచరణతో జిల్లాలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోక్సో కేసుల దర్యాప్తు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి సరైన ఆధారాలతో ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేయాలని సూచించారు. ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు భద్రత, గంజాయి కట్టడి, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టి ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. రోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ ద్వారా ముఖ్యమైన కూడళ్లలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పేకాట శిబిరాలపై దాడులు చేసి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టాలన్నారు. నివాసాలు, వ్యాపార సముదాయాలు, ఆలయాలు, ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. జైలు రిలీజ్, రౌడీ షీటర్లు హిస్టరీ షీట్ వారిపై ప్రత్యేక నిఘా ఉంచి నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు.

ప్రతిభకు ప్రశంస

జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లో నేరస్తులను పట్టుకోవడం, కేసుల ఛేధన, దర్యాప్తు, కేసు ప్రాపర్టీ స్వాధీనంలో ప్రతిభ కనబరిచిన సిఐలు పైడిపు నాయడు, ప్రసాదరావు, సత్యానారాయణతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసపత్రాలను ప్రదానం చేసి ప్రశంసించారు. క్షేత్రస్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతిఒక్కరూ సమిష్టిగా పనిచేయడం వల్లే జిల్లాలో నేరాలు గణనీయంగా తగ్గాయని కొనియాడారు. సమావేశంలో ఎఎస్‌పి (అడ్మిన్) కె.వి రమణ, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, మూర్తి, ప్రసాదరావు, సిఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కార్మిక వర్గ శ్వాస లెనిన్

శత వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

లెనిన్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ కార్మిక వర్గ శ్వాస లెనిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'పెట్టుబడి-ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. లెనిన్ మానవాళి కష్టాలకు, కన్నీళ్లకు మూలమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూనే, మరోవైపు 1917 అక్టోబరులో కార్మిక వర్గం తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టి రష్యాలో కార్మిక వర్గ సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించారని తెలిపారు. బూర్జువా ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులు కాలరాయబడతాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పేద వర్గాల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడుతోందని, అదానీ వంటి కొంతమందిని బలపరచడానికి అధికారాన్ని ఒక సాధనంగా వాడుకుంటోందన్నారు. ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేస్తూనే ఎయిర్‌పోర్టులు, పోర్టులు, హైవేలు, విద్యుత్, మైనింగ్, బొగ్గు వంటి అనేక రంగాల్లో అదానీకి ఎదురు లేకుండా ప్రత్యర్థులను లొంగదీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తమ అధికారాన్ని వినియోగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా, మోడీ కనుసన్నల్లో నడుస్తోందని చెప్పారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందనివిమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నిరంకుశ పద్ధతులను అవలంభిస్తుందన్నారు. అందరికీ సమాన అవకాశాలు ఉండే సమాజం కోసం ఐక్య ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సు ప్రారంభానికి ముందు లెనిన్, ఇటీవల మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు వి.జి.కె మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈనెల 25వ తేదీన వి.జి.కె మూర్తి సంస్మరణ సభను నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.సింహాచలం, ప్రజాసంఘాల నాయకులు అల్లు సత్యం, కొత్తకోట అప్పారావు, ఎం.గోవర్ధనరావు, ఎం.ఆదినారాయణ మూర్తి, ఎ.సోమశేఖర్, బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోహనరావు

ఆర్‌ఎస్‌కెల ద్వారా ధాన్యం కొనుగోలు

రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు డిమాండ్

ప్రజాశక్తి - మందస

రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, మండల కార్యదర్శి ఎం.ధర్మారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం నిబంధనల పేరుతో కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధాన్యం నమోదు చేయడానికి అధికారులు రోజు వారీ లక్ష్యాలను నిర్ణయించి ఉదయం ఆరు గంటల తర్వాత సాయంత్రం నాలుగు గంటల్లోపు మాత్రమే నమోదు చేయాలని నిబంధనల విధించారని చెప్పారు. దాన్ని ఆసరా చేసుకుని మిల్లర్లు ప్రైవేటుగా కొన్న ధాన్యాన్ని, ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తెచ్చిన ధాన్యాన్ని తమకు అనుకూలంగా ఉన్న వారి పేర్లతో రాత్రి ఒంటి గంటకే తప్పుడు పద్ధతుల్లో ఎంట్రీలు చేయిస్తున్నారని చెప్పారు. ఉదయం ఎంట్రీ కోసం వెళ్లిన రైతులకు అప్పటికే లక్ష్యాలు అయిపోయాయని, మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు లేవని అధికారులు నిరాకరిస్తున్నారని తెలిపారు. దీనివల్ల వారాల తరబడి రైతులు ధాన్యం అమ్ముకోలేక కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయకుండా తప్పుడు పద్ధతులు అనుసరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, రోజు వారీ లక్ష్యాలను తొలగించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో రైతుసంఘం నాయకులు కె.అంగదా, కె.ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్‌ను పునరుద్ధరించాలి

జెసికి యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ అమల్లో భాగంగా పిఆర్‌సి కమిషన్ నియమించడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామూర్తి కోరారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపునకు రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2023 జులై ఒకటి నుంచి 12వ వేతన సవరణ సంఘం అమల్లో ఉండాలని గత ప్రభుత్వం మన్మోహన్ సింగ్‌ను చైర్మన్‌గా ఏర్పాటు చేసి ఒక్క సమావేశాన్నీ నిర్వహించలేదన్నారు. కమిషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని, ఆ బకాయిలు నేటికీ రూ.32 వేల కోట్లకు చేరుకున్నాయన్నారు. 11వ పిఆర్‌సి ఎరియర్స్ రూ.7384 కోట్లు, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ రూ.9,650 కోట్లు, సిపిఎస్ ఉద్యోగుల బకాయిలు రూ.2500 కోట్లు, ఎపిజిఎల్‌ఐ చెల్లింపులు రూ.950 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. ఆర్థిక సమస్యలతో ఉద్యోగ, ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని ఈ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. జెసిని కలిసిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

అందరి ఆమోదంతోనే ఎయిర్‌పోర్టు

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

స్థానిక రైతుల అనుమతి, ఆమోదం లేకుండా కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఒక్క అడుగూ ముందుకు వేయబోమని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ బడ్జెట్, సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. 2025-26 అంచనా బడ్జెట్ రూ.13,71,83,200 ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. కార్గో ఎయిర్‌పోర్టుపై రైతులకు సమాచారం లేకుండా సర్వే ఎలా చేస్తారనిమండల విప్ తిర్రి గుణ ప్రశ్నించగా, దీనిపై వాడివేడి చర్చ సాగింది. పరిశ్రమలు, ఎయిర్‌పోర్టు వస్తే ఆ ప్రాంతంలో భూముల ధరలు పెరుగుతాయని, స్థానికులకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఎమ్మెల్యే శిరీష అన్నారు. దీన్ని సహించలేకే ఉద్యమాలు అంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తప్పు చేసి, వాటిని రైతులు, ప్రతిపక్షాలపై నెడితే సహించేది లేదని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో రైతులకు పరిహారం విషయంలో అన్యాయం జరగకూడదన్నారు. భూముల సర్వే సమయంలో రైతులకు తెలియజేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. భూముల సర్వే కేవలం ఎయిర్‌పోర్టు ఫీజుబిలిటీ కోసమేనని, అందుకే స్కెచ్ ఇచ్చామని, ఇంకా ఫైనల్ కాలేదని తహశీల్దార్ చెప్పడంతో చర్చ ముగిసింది. ప్రోటోకాల్‌ను అధికారులు ఉల్లంఘిస్తున్నారని ఎంపిపితో పాటు పలువురు సభ్యులు ఎమ్మెల్యేను నిలదీయడంతో గందరగోళం నెలకొంది. అందుకే తాము ఉపాధి హామీ పనులకు సంబంధించిన సంతకాలు చేయలేదని ఉదయ్ కుమార్, ఇతర సభ్యులు చెప్పారు. వజ్రపుకొత్తూరు మండలంలో సర్పంచ్‌లు సహకరించకపోవడంతో ఉపాధి హామీ సిసి రోడ్ల నిర్మాణంలో వెనుకబడ్డామని ఎమ్మెల్యే శిరీష అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి పలాస, మందస మండలాల్లో లేదన్నారు. అభివృద్ధికి సహకరించాలని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. వజ్రపుకొత్తూరు మండలంలోని 11 తీర ప్రాంత పంచాయతీల్లో ఇసుక నేలల్లో పనులు చేపట్టేదుకు అనుమతులు ఉన్నాయని, పనులు చేపట్టాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. దేవునల్తాడలో రూ.రెండు కోట్లతో సీ కేజ్ కల్చర్, ఆధునాతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎఫ్ఎఓ ధర్మరాజు పాత్రో తెలిపారు. సమావేశంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పి.శ్రావణి, వైస్ ఎంపిపిలు వంక రాజు, తమ్మినేని శ్రావణి, ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బౌద్ధ విగ్రహాలు లభ్యం

ప్రజాశక్తి - లావేరు

మండలంలోని బుడుమూరులో శాలిహుండంలోని బౌద్ధుల సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన అనేక విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. ఈ విగ్రహాలు బుద్ధుని కాలం కంటే ముందు అమ్మవారిగా కొలిచిన మారిచి అమ్మవారి విగ్రహం గ్రామం మధ్యలోనే ఉండడం విశేషం. ఈ విగ్రహాన్ని స్థానికులు వమరవల్లి అమ్మవారు అని పేర్కొంటున్నారు. ఏనుగుపై అమ్మవారు ఉన్న విగ్రహం బుద్ధుని కాలం కంటే ముందు ఆరాధించిన సందర్భం కనిపిస్తోంది. కళింగ గాంగుల కాలంలో ఉన్న విగ్రహాలు కూడా కొన్ని చిన్న చిన్నవి గ్రామాల్లో కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో కొందరు గ్రామపెద్దలు దుర్గాదేవి గుడిని నిర్మించగా, ఆ సందర్భంలో నాలుగైదు విగ్రహాలు ప్రాచీనమైనవి లభించగా, వాటిలో బుద్ధుని విగ్రహాన్ని పక్కన ఉంచడం ఇంటాక్ బృందం గమనించింది. బుడుమూరు గ్రామాన్ని సందర్శించి, గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు అక్కడ ఉన్న పురాతన విగ్రహాలను పరిశీలించింది. ఈ బందంలో కన్వీనర్ ఎన్.సన్యాసిరావు, అదనపు కన్వీనర్ వి.జగన్నాథనాయుడు, సీనియర్ మెంబర్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ ఉన్నారు. గతంలో ఈ ప్రాంతమంతా కూడా కళింగ గంగుల పాలనలో ఉన్నట్లుగా, తదనంతరం బౌద్ధ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు ఇక్కడ ఉన్నట్లు ఈ బృందం భావిస్తోంది. దీనిపై విస్తృత పరిశోధన చేస్తే, ఈ ప్రాంతం చారిత్రక వైభవాన్ని తెలుసుకోవచ్చని వీరు అభిప్రాయపడ్డారు. ఇక్కడ లభించిన విగ్రహాల చిత్రాలను ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు పంపించనున్నట్లు ఇంటాక్ కన్వీనర్ సన్యాసిరావు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధిపై యువత దృష్టి

శ్రీకాకుళం అర్బన్ : యువత చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టిసారించడం ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని డిఎల్‌టిసి కేంద్రంలో జాబ్‌మేళాను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడాప్, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ఎంపికల్లో హాజరై ఉద్యోగావకాశాలు దక్కించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని, వాటిని చేజిక్కించుకునేందుకు వీలుగా నైపుణ్యాన్ని సాధించాలన్నారు. అపోలో, సీనర్జీస్ వంటి అనేక సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడాప్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, ప్రభుత్వ ఐటిఐ అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

24న సుకన్య సమృద్ధి యోజన మేళా

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 24 సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరిచేందుకు మేళా నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ మేళాలో జిల్లావ్యాప్తంగా 3,500 సుకన్య సమృద్ధి ఖాతాలు ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. పదేళ్ల లోపు వయసు గల బాలికల పేరుతో ఈ ఖాతాను ప్రారంభించవచ్చని తెలిపారు. కాలపరిమితి 21 ఏళ్లుగా నిర్దేశించినట్లు వివరించారు. బాలికకు 18 ఏళ్లు నిండిన తర్వాత ఉన్నత విద్య కోసం ఉన్న మొత్తంలో 50 శాతం వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివాహం నిమిత్తం వివాహానికి నెల రోజులు ముందు గానీ, వివాహానంతరం మూడు నెలల్లోపు పథకాన్ని ఉపసంహరించుకునేందుకు వీలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఒక ఆర్థిక సంవత్సరానికి కనీసం రూ.250 నుంచి మొదలు గరిష్టంగా రూ.1,50,000 వరకు చెల్లించవచ్చని తెలిపారు. ఖాతాలో జమ చేసిన మొత్తానికి పన్ను మినహాయింపు ఉందని తెలిపారు. ఖాతాను ఏ పోస్టల్ కార్యాలయానికైనా బదిలీ చేసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలని సూచించారు.

బిజెపి జిల్లా అధ్యక్షులుగా తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిజెపి జిల్లా అధ్యక్షులుగా పాతపట్నంకు చెందిన సిరిపురపు తేజేశ్వరరావు నియమితులయ్యారు. నగరంలోని ఒక కళ్యాణ మండపంలో జిల్లా అధ్యక్ష ఎన్నిక ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావుతో పాటు పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్న ఆలోచనతో పార్టీ అధిష్టాం తేజేశ్వరరావు పేరును ప్రకటించింది. సమావేశంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, బిజెపి రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు, సంపతిరావు నాగేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడితే చర్యలు

ప్రజాశక్తి - లావేరు, ఎచ్చెర్ల

లావేరు : పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

పనుల నాణ్యతపై ఉపాధి హామీ సిబ్బంది దృష్టిసారించాలని, నాణ్యత విషయంలో రాజీ పడితే చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు హెచ్చరించారు. మండలంలోని మురపాక, పెదరావుపల్లిలో చేపడుతున్న పల్లె పండగ రహదారి పనులతో పాటు గోకులాల పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత గోశాల పనులు పూర్తి చేయడంపై సిబ్బంది దృష్టిసారించాలని సూచించారు. ఇవి రైతాంగానికి, పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పల్లె పండగ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులను తక్షణమే ప్రారంభించి కూలీలకు ఉపాధిని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సత్యవతి, ఇసి లెనిన్ బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్ పనులు పరిశీలన

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం హౌసింగ్ లేఅవుట్ అభివృద్ధి పనులను డ్వామా పీడీ పరిశీలించారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అంతర్గత రహదారులు, లేఅవుట్ అభివృద్ధి పనులను క్వాలిటీ కంట్రోల్ బృందంతో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇసి నారాయణమ్మ, టిఎ మణికంఠ, క్వాలిటీ కంట్రోల్ అధికారి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

పలాస : ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ (గ్లో) ఆధ్వర్యాన ఈనెల 22న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. పలాస నియోజకవర్గవ్యాప్తంగా వెయ్యి యూనిట్ల రక్తాన్ని సేకరించే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఒకరు చేసిన రక్తదానంతో నలుగురి ప్రాణాలను కాపాడే అవకాశముందని పేర్కొన్నారు. ఎటువంటి అపోహలకు తావీయకుండా యువత రక్తదానం చేయాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.రాజేంద్రబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. ఎఐవైఎఫ్ 23వ జిల్లా మహాసభలను నగరంలోని క్రాంతి భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఎఐవైఎఫ్ పతాకాన్ని రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో రాజేంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు మెగా డిఎస్‌సిపై తొలి సంతకం, ఆరు నెలల్లో నిరుద్యోగ భృతితో పాటు 20 లక్షల ఉద్యోగాల హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు వాటి జాడ లేదని, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాల్లో పనిచేసిన 15,500 మందిని రోడ్డున పడేశారన్నారు. వాలంటీర్లకు రూ.పది వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఫిబ్రవరి ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు, నాయకులు సంతోష్, రాము, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

వి.జి.కె మూర్తి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఉద్యమ నేత వి.జి.కె మూర్తి మృతి జిల్లా ఉద్యోగ, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సంబూరు షణ్ముఖరావు అన్నారు. టెక్కలి సిఐటియు కార్యాలయంలో వి.జి.కె మూర్తి సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. ముందుగా వి.జి.కె మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూర్తి సిఐటియు జిల్లా తొలి అధ్యక్షునిగా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా పనిచేశారని అన్నారు. నిరంతర శ్రామికులుగా ఉద్యోగ, కార్మిక, ప్రజలను సంఘంలో చేర్పించి ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కరించే కృషి చేశారన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ వివిధ ప్రజా సంఘాల నాయకులు, కమ్యూనిస్టుగా నూటికి నూరు పాళ్లు ప్రజల కోసం పనిచేశారని అన్నారు. చనిపోయిన తర్వాత కూడా తన శరీరాన్ని రిమ్స్‌కు అప్పగించడం త్యాగానికి మారు పేరని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాలవలస ధర్మారావు, సామ దామోదరరావు, సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, ఉర్లాన లక్ష్మణరావు, వృత్తిదారుల సంఘం నాయకులు కొల్లి యల్లయ్య, జి.సుబ్రమణ్యం, రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు, యు.దుర్గాప్రసాద్, నంబాళ్ల రవణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

బాలింతలకు సౌకర్యాలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో చిన్నపిల్లల సంరక్షణ కోసం తల్లిపాలు అందించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. మంగళవారం ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను సందర్శించిన ఆయన గతంలో తల్లిపాల కేంద్రాలు లేక బాలింతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, వారి కోసం ప్రత్యేక సదుపాయాలను ఆర్‌టిసి ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి ఎ.విజయ్‌కుమార్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

రహదారంతా డొల్లే...

- నాణ్యత లేదంటున్న గిరిజనులు
- చోద్యం చూస్తున్న అధికారులు

తమ నడక కష్టాలు తీరుతాయని ఎంతో ఆశతో ఎదురుచూసిన గిరిజనులకు నిరాశ ఎదురవుతుంది. పాలకవర్గానికి, అధికారులకు విన్నవించుకున్న సందర్భంలో రహదారి మంజూరైనప్పటికీ తమ నడక కష్టాలు తప్పడం లేదని గిరిజనులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని అప్పలపేట పంచాయతీ పరిధిలోని అనంతగిరిపేట గిరిజన గ్రామంలో సరైన రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తమ గ్రామం నుంచి సరుబుజ్జిలి, మదనాపురం రోడ్డుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం రహదారి లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని గిరిజనులు పేర్కొన్నారు. అయితే దశాబ్దాల కాలంగా అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు పలుమార్లు విన్నవించుకోవడంతో ఎట్టకేలకు వైసిపి ప్రభుత్వంలో రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. 2022 జనవరి 6న మదనాపురం, సరుబుజ్జిలి రహదారి నుంచి తమ గ్రామానికి రహదారి నిర్మాణం కోసం ఎన్ఆర్‌జిఎస్ నిధులు రూ.64 లక్షలతో అప్పటి రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారాం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూడేళ్లయిన అతీగతి లేక రహదారి నిర్మాణాన్ని విడిచి పెట్టారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులు చుట్టూ పాలకవర్గం చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యమని, ప్రస్తుత ప్రభుత్వంలో ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తమ నడక కష్టాలను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రహదారి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రారంభానికి ముందే పెచ్చులూడిన తారు రోడ్డు

రహదారి బాగోలేదు

రహదారి ఏర్పాటు అవుతుందని ఆశపడ్డాం. అయితే ఎక్కడ చూసినా రహదారి మధ్యలో మొక్కలు మొలుస్తున్నాయి. మట్టిపైనే రోడ్డు వేయడంతో ఎక్కువ కాలం ఉండే పరిస్థితి కనిపించడం లేదు.

- గేదెల రాజు, అనంతగిరిపేట

అధికారులు చొరవ చూపాలి

బిటి రోడ్డు నిర్మాణంలో నాణ్యత కరువైంది. అధికారులు చొరవ చూపి రహదారిలో లోపాలను సరిచేసేందుకు చర్యలు చేపట్టాలి.

- కె.తేజవతి, అనంతగిరిపేట

తూతూ మంత్రంగా....

ఇటీవల రహదారి నిర్మాణం పనులను పూర్తి చేశారు. అయితే రహదారి నిర్మాణమంతా డొల్లేనని గిరిజనులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. రహదారి పూర్తయినప్పటికీ రహదారి ప్రారంభించక ముందే డొల్లంత బయటికి వస్తుందని గిరిజనులు వాపోతున్నారు. మట్టిపైనే చిప్స్ వేయడంతో ఎక్కడికక్కడ పెచ్చులూడిపోతుందని, కొన్ని దగ్గర్ల మొక్కలు కూడా మొలుస్తున్నాయని గిరిజనులు వాపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

బిటి రహదారి నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దశాబ్దాల కల నెరవేరిందని ఆశపడ్డ తమకు రహదారిలో నాణ్యత కరువైందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తిస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు కలిగిన రహదారి ఏర్పాటుకు కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

ఇదే విషయాన్ని రోడ్లు భవనాల శాఖ జెఇ నాగభూషణరావు వివరణ కోరగా రోడ్డు నిర్మాణంలో పర్యవేక్షణ చేయడం జరిగింది. అయితే రహదారి నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి తదుపరి చర్యలు తీసుకుంటాం.

మార్చి 8న లోక్ అదాలత్

కోటబొమ్మాళి: మార్చి 8న స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహిస్తున్నామని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, భార్యాభర్తలు, పలు రకాల కేసులను గుర్తించి రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయ వాదులు లఖినేని శ్రీనివాస్, పల్లి వాసుదేవరావు, వెలమల అప్పలనాయుడు, యండ వెంకటరావు, బి.ధర్మారావు, పంచిరెడ్డి అర్జునరావు, డి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి - టెక్కలి

విద్యార్థులు నిబిడీ కృతమైన సృజనాత్మకతని వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సైన్స్ ప్రయోగాల పోటీల పోస్టర్‌ను మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతు శాస్త్రీయ దృక్పథం అవసరమని అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ సుస్థిరత అభివృద్ధి, మూఢమ్మకాలు శాస్త్రీయ దృక్పథం అనే మూడు అంశాలపై విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. 8 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని అన్నారు. పై మూడు అంశాలపై విద్యార్థులు ప్రయోగాలు ఇంటి వద్ద గాని, పాఠశాల వద్ద గాని వీడియో రూపంలో తయారు చేసి గూగుల్ ఫామ్ ద్వారా పంపించాలన్నారు. ఫిబ్రవరి 15లోగా ఈ వీడియోలు పంపించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగతంగా గాని, బృందం రూపంలో గాని పాల్గొనవచ్చునని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అకడమిక్ కన్వీనర్ పాలవలస ధర్మారావు, సైన్స్ ఉపాధ్యాయులు వీరభద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విలియమ్స్

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - ఆమదాలవలస

నియోజకవర్గ పరిధిలో 22 రహదారుల నిర్మాణానికి రూ.349.65 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్టు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలోని రోడ్లు గుంతలు గోతుల మయంగా మారి ప్రజా రవాణాకు తీవ్ర ఆటంకంగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు సదుపాయం కల్పించాలన్న సదుద్దేశంతో సిఎం చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా మిషన్ మోడల్‌లో రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టుటకు నిధులు యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసినందుకు సిఎం చంద్రబాబుకు, రోడ్లు భవనాల శాఖామంత్రి బిసి జనార్ధన్ రెడ్డికి ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

టెక్కలి : ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

సజావుగా ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధి టెక్కలి, పాతపట్నం, కొత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న 22 వివిధ రకాల పోస్టులకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి తన కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మూడు ప్రాజెక్టు పరిధిలో అధిక శాతం గిరిజన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సిడిపిఒలు ఎస్.శోభారాణి, విమలారాణి, కుమారి పాల్గొన్నారు.

పలాస : రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఆర్‌డిఒ గ్రంధి వెంకటేష్ అంగన్వాడీ పోస్టుల భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలాస మండలంలో 3 పోస్టులకు, మందస మండలంలో 7 పోస్టులకు, సోంపేట మండలంలో ఒక పోసులకు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ బి.శాంతిశ్రీ, టెక్కలి డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేదార్ పాల్గొన్నారు

శతశాతం లక్ష్యాలు సాధించాలి

మందస: మహిళా సాధికారత కోసం ప్రభుత్వ ఆశయం మేరకు నిర్దేశించిన శత శాతం లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో మంగలవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి స్వయం శక్తి సంఘంలో కూడా సభ్యులు అవసరం మేరకు అంతర్గత అప్పులు ఇప్పించడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిధులు సరిపోని పరిస్థితిలో గ్రామ సంఘం ద్వారా స్త్రీనిధి రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. ప్రతి స్వయం శక్తి సంఘం కూడా వారి గ్రామ సంఘంలో విధిగా పొదుపు చేయాలని తెలిపారు. అన్ని గ్రామ సంఘాలూ మండల సమాఖ్యలో వారి సేవింగ్స్‌ను ఉంచుకోవచ్చునన్నారు. ప్రతి చిన్న సంఘం కూడా వారి పొదుపులు, అప్పులు, ఆదాయాలు అన్నింటిపై సభ్యులందరికీ అవగాహన వచ్చేవిధంగా కమ్యూనిటీ ఆడిటర్లతో విధిగా ఆడిట్ చేయించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రభుత్వం మంజూరు చేసిన వన్ దన్ వికాస కేంద్రాలను పారదర్శకత్వంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఏంటి ఆపరేటర్ రాజారావు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్ నడుపుతున్న విప్ అశోక్

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి - కవిటి

పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి గ్రామస్థాయి నుంచి పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కవిటి మండలంలోని మాణిక్యపురం, లండారిపుట్టుగ, కపాసుకుద్ది, నెలవంక, సహలాలపుట్టుగ, జగతి, బెలగాం పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయి. వీటిని విప్ మంగళవారం ప్రారంభించి స్వయంగా ట్రాక్టర్ డ్రైవింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంతో చక్కటి ఆరోగ్యం - ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందన్నారు. దానికి చక్కటి పారిశుధ్య నిర్వహణ అవసరమని అన్నారు. ప్రభుత్వ సంకల్పమైన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ పరిపూర్ణమవాలంటే శత శాతం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, నాయకులు బెందాళం రమేష్, సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, బార్ల చిన్నబాబు, కుమార్ మోహన్‌రెడ్డి, బెందాళం తిరుమల, దేవరాజ్ సాహు, కొర్రాయి వాసుదేవ్, బాసుదేవ్ రౌలో, బీమా రౌలో, పుల్లట రాజు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - కవిటి

అశోక్, విప్

విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుది ఉక్కుసంకల్పమని, ఆయన కృషి ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం రూ.11440 కోట్ల నిధులు ప్రకటించిందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ చేయాలని, ఉక్కును అమ్ముకోవాలని నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భావిస్తే, విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ప్రస్తుత సిఎం పనిచేస్తున్నారని అన్నారు. విశాఖపట్నం వచ్చిన ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి ఉక్కు సంక్షోభం నుంచి గట్టెక్కించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్ వినతిపత్రం ఇచ్చిన కొద్దిరోజులకే రూ.1650 కోట్లు కేటాయించడం గమనార్హమని అన్నారు. ఇప్పుడు మళ్లీ రూ.11440 కోట్లు ప్రకటించడం అభినందనీయమని తెలిపారు.

పోలాకి : సిఎం నారా చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందించిందన్నారు.

పాతపట్నం : సిఎం చంద్రబాబు కృషితోనే విశాఖ స్టీల్‌ప్లాంట్ కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో విలేకరులతో మాట్లాడారు. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, మధు, కలమట భుజంగరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : విశాఖ ఉక్కు సంక్షోభంపై ఉద్యోగ సంఘాలు, ప్రజలు ఆందోళన చెందుతున్న తరుణంలో సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఆర్థిక ప్యాకేజీని తీసుకు రాగలిగారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం నగరంలోని విశాఖ ఎ కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సమావేశంలో టిడిపి నాయకులు గొండు వెంకట రమణమూర్తి, సింతు సుధాకర్, మాదారపు వెంకటేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వేగం కంటే ప్రాణం మిన్న

సిఐ సత్యనారాయణ

ప్రజాశక్తి - బూర్జ

సత్యనారాయణ, సిఐ

ప్రస్తుతం వేకుజామున విపరీతమైన మంచు కురుస్తుండటంతో వాహనదారులు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి పొగ మంచు దట్టంగా కమ్ముకొని ఉదయం ఏడు గంటలైనా రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించని పరిస్థితి ఏర్పడుతున్నాయన్నారు. దీనివల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. పొగ మంచు మాటున ప్రమాదం పొంచి ఉందని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లపై పొగ మంచు ఏర్పడటం వల్ల ప్రయాణం ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని తెలిపారు. వాహనాల నుంచి వెలువడిన పొగ కారణంగా మంచు మరింత దట్టంగా మారుతుందని వాహనానికి లైట్లు వేసుకున్నా ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించడం లేదన్నారు. ఈ సమయంలో వేగంగా ప్రయాణం చేస్తే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఫిబ్రవరి నెల చివరి వరకు పొగ మంచు అధికంగా ఉంటుందని వాహన చోదకులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేగం కంటే ప్రాణం మిన్న అని వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

వైద్యారోగ్య కార్యదర్శి దృష్టికి ఆస్పత్రి సమస్యలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో నెలకొన్న ఆనేక సమస్యలను పరిష్కరించాలని సీడాప్ మాజీ చైర్మన్ పాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు విజయవాడలోని వైద్య ఆరోగ్యశాఖ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉందని అన్నారు. జనరేటర్ అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల సమయంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారని, చిన్న చిన్న పెండింగ్ పనులు వల్ల అందుబాటులోకి రాలేదని వివరించారు. బారువలో నాబార్డు నిధులు రూ.655 లక్షల అంచనా వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆస్పత్రి నిర్మాణ పనులు చివరి దశలో నిలిపివేశారని అన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కవిటి, సోంపేట మండల కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయని, వీటి సామర్థ్యం మించి డయాలసిస్ రోగులు పెరుగుతున్నారని అన్నారు. ఇచ్ఛాపురం, బారువలో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. వీటిని వైద్య ఆరోగ్యశాఖ సెక్రటరీ సానుకూలంగా స్పందించారు.

పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

గ్రామీణ రోడ్లకు మహర్దశ

వజ్రపుకొత్తూరు: టిడిపి కూటమిలో గ్రామీణ రోడ్లకు మహర్దశ కలిగిందని తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి కోనారి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండవూరులో సిమెంట్ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.31.50 లక్షలతో 765 మీటర్ల పొడవు ఉన్న నాలుగు సిమెంట్ రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. పనులు నాణ్యతలో రాజీపడకుండా చూడాలని అధికారులను కోరారు. గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీషకు గ్రామస్తులు తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి లండ ధనరాజ్, నీటి సంఘం సభ్యులు యిప్పిలి గిరిబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పేరా లిగల్ వాలంటీర్లుగా శిక్షణ పొందుటకు కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు మండలాలకు చెందిన అభ్యార్థులు ఫిబ్రవరి 5లోగా మండల న్యాయ సేవా సంఘాలకు దరఖాస్తు చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా న్యాయసేవా సంఘం సంస్థ ద్వారా వారికి శిక్షణ ఇస్తామన్నారు.

తద్వారా గ్రామాల్లో వీరు న్యాయ సలహాలు, సూచనలు అందించే విధంగా కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యార్థుల వయస్సు 18 ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. మిగిలిన వివరాలకు మండల న్యాయసేవా సంఘం వారిని సంప్రదించాలన్నారు.

మాదకద్రవ్యాలపై విస్తృత తనిఖీలు

లావేరు : గంజాయి, మాదకద్రవ్యాల వాడకం విపరీతంగా పెరుగుపోవడంతో యువత చెడు మార్గాలు పట్టడంతో దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం, పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్‌పి ఆదేశాల మేరకు లావేరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.లక్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం వెంకటాపురం, సుభద్రాపురం, బుడుమూరు గ్రామాల కూడళ్లలో దుకాణాల్లో కెనైన్ డాగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. దుకాణాలు, వాహనాలను, బస్సులను తనిఖీ చేశారు. గంజాయి అక్రమ రావణా నిల్వలకోసం అనుమానం ఉన్నచోట్ల పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎఎస్ఐ భుజంగరావు, సిబ్బంది ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


దుకాణంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

గ్యాస్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - కవిటి

గ్యాస్ వినియోగం, వాడకంపై భారత్ గ్యాస్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని, గ్యాస్ వినియోగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జగతి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.ఆర్.మూర్తి అన్నారు. జగతి పాఠశాలలో చింతామణి భారత్ గ్యాస్ ఆధ్వర్యాన మంగళవారం మన వంటగది - మన బాధ్యత అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం చింతామణి భారత్ గ్యాస్ యజమాని కొండేటి వెంకటరావు మాట్లాడుతూ ఎల్‌పిజి గ్యాస్ వినియోగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ కుటుంబ సభ్యులకు గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చింతామణి గ్యాస్ సిబ్బంది కొండా కూర్మారావు, శంకర్, గవ్వల భాగ్యం, దుద్ది మణి, శార్వాణి, శేఖర్, దేవరాజు, కామరాజు, జగదీష్, మాధవరావు, జగదీష్, అశోక్, మణి, శ్రావణి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న గ్యాస్ యాజమాన్య ప్రతినిధులు

క్రైమ్ కార్నర్

ఢిల్లీరావు మృతదేహం (ఇన్‌సెట్‌లో ఢిల్లీరావు ఫైల్)

అనుమానాస్పద స్థితిలో
కౌలు రైతు మృతి

- హత్య అంటున్న కుటుంబసభ్యులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం

ప్రజాశక్తి - పలాస

మండలంలోని రామకృష్ణాపురం పంట పొలాల్లో చిన్ననీలావతికి చెందిన కౌలురైతు తెప్పల ఢిల్లీరావు (57) అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. మృతదేహాన్ని మంగళవారం వేకువజామున కాశీబుగ్గ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... చిన్ననీలావతికి చెందిన తెప్పల ఢిల్లీరావు, భార్య కమల పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. పంట భూములను కౌలుకు తీసుకోవడం, ప్రొక్లెయినర్, ట్రాక్టర్ నడుపుతూ ఆవులను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. కౌలు భూములు రామకృష్ణాపురానికి సమీపంలో ఉన్నాయి. దీనిపై కాశీబుగ్గకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఓ వైద్యునితో తగాదాలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై మూడుసార్లు మూడు చోట్ల చర్చించారు. ఈ వ్యవహారంలో నాయకులు మధ్యవర్తిత్వం వహించినా వివాదం కొనసాగుతునే ఉంది. సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో చిన్ననీలావతి ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై రామకృష్ణాపురం భూముల వద్దకు వెళ్లాడు. రాత్రి 9 గంటలైనా ఢిల్లీరావు ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య కమల ఫోన్ చేసినా లిఫ్ చేయలేదు. అనంతరం రామకృష్ణాపురంలోని తన బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో అనుమానం వచ్చింది. బంధువు సొర్ర ప్రశాంత్ సమీప పంట పొలాల్లో వెతకగా... మంటల్లో కాలిపోతున్న ఢిల్లీరావును గుర్తించాడు. ఈ విషయాన్ని ఢిల్లీరావు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. రాత్రి 11 గంటలకు గ్రామస్తుల సహకారంలో ఢిల్లీరావు శవాన్ని గర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పొలాలకు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు అమర్చడంతో అవి తాకి మృతి చెందినట్లు సమాచారం. ప్రశాంత్ ఢిల్లీరావును వెతెకే క్రమంలో ఆ ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు గుసగుసలాడుకుంటున్నారు. వారు అక్కడ నుంచి విద్యుత్ వైర్లను తొలగించి పారిపోయినట్లు ప్రచారం సాగుతోంది. సంఘటన స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసు క్లూస్టమ్ సభ్యులు చేరుకుని పరిశీలించారు. పొలాల్లో అమర్చిన తీగలను సేకరించి స్టేషన్‌కు తరలించారు. ఎఎస్ఐ జి.సంజీవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల మీదుగా స్వగ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

ముమ్మాటికీ హత్యే..

ఢిల్లీరావు మృతి చెందిన తీరు పరిశీలిస్తే ముమ్మాటికీ ఇది హత్యగానే కనిపిస్తోందని ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దిల రామారావు, పత్రి దానేసు, వంకల మాధవరావు, సీనియర్ న్యాయవాది పిండి వెంకటరావు ఆరోపించారు. ఆయనకు చెందిన స్థలంలో విద్యుత్ తీగలు అమర్చడంతో తీవ్రత ఎక్కువైందన్నారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి వాస్తవాలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

చినబైపల్లిలో వివాహిత...

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినబైపల్లి జీడి తోటలలో తామాడ శాంతమ్మ (55) అనే వివాహిత అనుమానస్పదస్థితిలో మృతి చెందింది. మంగళవారం మృతురాలి అక్క కుసుమలు మారి తోటలోని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జీడితోటలో ఓ చెట్టుకు లైనాన్ తాడు కట్టుకొని ఊరుపోసుకుని, తాడు తెగిపోయి మృతదేహం కింద పడిపోయిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా తాడుతో తలకు కట్టివేలాడ దీశారా? ఆమే స్వయంగా ఊరుపోసుకొని ఆత్మహత్యకు పాల్పడిందా? అనే అనుమానాలూ ఉన్నాయి. శాంతమ్మ భర్త తులసీదాస్ చాలా ఏళ్ల క్రితం మృతి చెందారు. మృతురాలికి కుమారుడు హరికృష్ణ ఉన్నారు. ఈయన షిమాన్ ఉద్యోగంలో ఉద్యోగం చేస్తున్నారు. కోడలు వేరే రాష్ట్రంలో ఉద్యోగం చేస్తుంది. దీంతో శాంతమ్మ ఒంటిరిగానే బైపల్లిలో నివాసం ఉంటుంది. అప్పుడప్పుడూ జీడితోటకు వస్తూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. శాంతమ్మ మృతి ఈ ప్రాంతంలో సంచలనంగా మారింది. సమాచారం అందుకున్న ఎఎస్ఐ జిన్నారావు సంఘటనా స్థలంకు చేరుకొని శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్ఐ బి.నిహార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతమ్మ మృతదేహం

అవార్డు అందుకుంటున్న అమ్మోజీ

అమ్మోజీకి తెలుగు తేజం పురస్కారం

ప్రజాశక్తి- రణస్థలం

సాహిత్య రంగంలో అమ్ముకలం మరింతగా విస్తరించాలని, సామాజిక సేవలో తనదైన కృషి నిరంతరాయంగా అందించాలని ఎస్‌పి కొండా నరసింహారావు, శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కొనియాడారు. మండలంలోని కోష్ట సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న బమ్మిడి అమ్మోజీ సాహిత్యరంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా మంగళవారం విజయవాడలోని పూర్ణానంద విలాస్‌లో జాతీయ విశిష్ట సాహితీసేవ పురస్కారం అందజేశారు. వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ రైటర్స్ అకాడమి, తెలుగు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సంయుక్తంగా అందజేస్తున్న తెలుగుకీర్తి పురస్కారాన్ని అమ్మోజీకి అందజేశారు. సెక్స్ వర్కర్స్‌పై ఆమె చేసిన డాక్యుమెంటరీ, శ్రీశ్రీ కళావేదిక మీడియా ప్రతినిధిగా చేస్తున్న సాహిత్య కార్యక్రమాలు, అనాథ పిల్లలకు అందిస్తున్న సహాయం తదితర అంశాల్లో ఆమెని ఈ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. బోయి భీమన్న సాహిత్య నిధి ట్రస్ట్ చైర్‌పర్సన్ బోయి హైమవతి, కన్వీనర్ కొల్లి రమావతి, నన్నయ యూనివర్శిటీ విసి తరపట్ల సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ లీగల్ అడ్వైజర్ వై.హేమారావు తదితరుల చేతులమీదుగా అమ్మోజీ ఈ అవార్డు అందుకున్నారు.

అవార్డు అందుకున్న శ్యామలరావు

'పులి కాలం' నాటికకు రెండు బహుమతులు

ఆమదాలవలస : ప్రవాసాంధ్ర నవ్య కళాపరిషత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖర్గపూర్‌లో ఈ నెల 19, 20న అఖిల భారత స్థాయి నాటికల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కుప్పిలి వెంకటరాజారావు రచించి, దర్శకత్వం వహించిన పులి కాలం నాటికలో విలన్ పాత్రలో నటించిన కుప్పిలి శ్యామలరావుకు ఉత్తమ విలన్ అవార్డు లభించింది. ఇదే నాటికలో నటి ఎస్.దీపికకు ఉత్తమ నటిగా కన్సొలేషన్ బహుమతి లభించింది. సినీనటుడు నాగినీడు చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు జాతీయ ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి- పలాస

విజయవాడ కౌతా పూర్ణానంద విలాస్ కళావేదికపై ఐఎస్ఒ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక 143వ కార్యక్రమంల నిర్వహించారు. ఇందులో భాగంగా తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వరల్డ్ రైటర్స్ ఫోరమ్ వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త నిర్వహించారు. కవి, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి తెలుగు భాషా సాహిత్యంలో చేస్తున్న కషిని గుర్తించి శ్రీశ్రీ కళావేదిక సిఇఒ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రామావతి, జాతీయ అధ్యక్షులు ఈశ్వరీభూషణం, దూరదర్శన్ డైరెక్టర్ ఉప డైరెక్టర్లు కొండలరావు, నరసింగరావులు దుశ్శాలు కప్పి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు.

ఎంపిటిసిల గౌరవ వేతనం అందేనా..?

ఏడాదిగా అందని వైనం

ప్రజాశక్తి- బూర్జ

ఎంపిటిసిలు గౌరవ వేతనం కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది కాలంగా ఎంపిటిసిలకు గౌరవ వేతనం అందలేదు. గత ఫిబ్రవరి నెలలో ప్రభుత్వం ఎంపిటిసిలు, సర్పంచ్‌లకు గౌరవ వేతనాన్ని విడుదల చేసింది. అయితే నేటికి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు గౌరవ వేతనం అందకపోవడం విశేషం. బూర్జ మండలంలో 11 మంది ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులతో పాటు ఎంపిపి ఉన్నారు. ఒక ఎంపిటిసికి రూ.3 వేలు చొప్పున రూ.36 వేలు, ఎంపిపికి రూ.6వేలు చొప్పున ఏడాదికి రూ.72 వేలు గౌరవ వేతనం అందాల్సి ఉంది. అయితే గౌరవ వేతనం కోసం ఎంపిటిసిలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం త్వరలో మూడు నెలల బిల్లులను ఎంపిటిసిలకు ఎంపిపికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎఒ శ్రీనివాసరావు తెలిపారు.

ఎంపికైన విద్యార్థినులు

ఎల్‌టిఐకి విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని అరసవల్లి జంక్షన్‌లో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ఎల్‌టిఐ మైండ్ ట్రీ కంపెనీలో ఉద్యోగ నియామకాలకు ఎంపికయ్యారు. మంగళవారం నిర్వహించిన ప్రాంగణం ఎంపికల్లో 16 మందికి అవకాశం దక్కింది. వారికి ఏడాదికి రూ.3.2 లక్షల వేతనంతో కూడిన ఉద్యోగాల్లో నియమితులు కానున్నట్టు కళాశాల డైరెక్టర్ బిఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి ఉద్యోగాలకు ఉపయోగపడే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రాధాన్యత ఉన్న కోడింగ్‌పై విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డా.ఎన్.సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా.బి.ఇ.వి.ఎల్ నాయుడు అభినందించారు.

పెద బుడ్డిడికి బస్సు నడపాలి

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

పార్వతీపురం నుంచి జియమ్మవలస మండలం పెదబుడ్డిడికి ఆర్‌టిసి బస్సు నడపాల్సిందేనని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రంజిత్ కుమార్ మంగళవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. గ్రామస్తులు బస్సు నడపాలని కోరుతూ అర్జీ పెట్టగా అధికారులు సరిపడినన్ని బస్సుల్లేవని, ఆదాయం లేదని కారణాలు చెప్పడం సరైంది కాదని, ఆ సమస్యలు ప్రభుత్వం, అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉన్న బస్సులు సర్దుబాటు చేసి, కొత్త బస్సుల కోసం ప్రభుత్వానికి నివేదించాలని రంజిత్ కుమార్ తదితరులు కోరారు.

పశు వైద్య శిబిరం.. పాడి రైతులకు వరం

లావేరు : పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు లావణ్య

ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వం అమలు చేస్తున్న పశుఆరోగ్య వైద్య శిబిరాలు పాడి రైతులకు వరమని జెడి కె.రాజగోపాలరావు అన్నారు. మండలంలోని కాలపర్తి పంచాయతీ పరిధిలోనున్న సుంకర పేటలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు అవగాహన లేక తమ విలువైన పశుసంపదను నష్టపోతున్నారన్నారు. పాడి పసువులకు, గొర్రెలకు వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన లేక పోవడం వలన మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో ఆవులు, గేదెలు 3,75,300 వరకు ఉన్నాయన్నారు. దూడలు 45,914, గొర్రెలు, మేకలు రెండు లక్షల పంతొమ్మిది వేలు ఉన్నాయన్నారు. అయితే వీటికి నులిపురుగులు సోకడంతో అవి అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. దీనివలన మూగజీవాలు వ్యాధి నిరోధక శక్తి కోల్పోయి మృత్యువాత పడుతున్నాయన్నారు. అలాగే కొన్నివేల కోళ్లు ఉన్నాయన్నారు. మూగ జీవాలకు సంక్రమిస్తున్న వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దీనివలన వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధులకు అవసరమైన చికిత్సను అందజేయడమే కాకుండా వ్యాధి నివారణకు అవసరయ్యే మందులను, వ్యాక్సిన్లను అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అన్ని గ్రామాల్లో పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎడిలు ఆనందరావు, సుబ్రహ్మణ్యంతో పాటు సర్పంచ్ శ్రీరామ్‌మూర్తి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని అల్లెనలో పశువైద్య శిబిరాన్ని వైద్యాధికారి జ్యోత్స్న నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అందించే పశుగ్రాసాలను వినియోగించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సూర్య నారాయణ, వైద్య సిబ్బంది సూర్యకుమారి, లోక నాథం, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, గోవిందరావు, రాము, నాయకులు రాంజీ, రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

లావేరు: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పాడిరైతులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి లావణ్య అన్నారు. మండలంలో రెండోరోజు కేశవ రాయునిపాళెం, పెదలింగాలవలసలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో పాడిపశువులు, గొర్రెలు, మేకలకు టీకాలు, నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. పశువైద్యులు హేమంత్‌కుమార్, గాయత్రి పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని తిడ్డిమిలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న ప్రతి ఒక పథకాన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు గాలి కుంటు టీకాలు వేయించాలని, అప్పుడే ఎటువంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చని అన్నారు. అనంతరం పాడి రైతులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు, తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపిడిఒ చంద్రకుమారి, టిడిపి మండల నాయకులు పైల బాబ్జి, శివాల చిన్నయ్య, చర్ల ప్రభాకరరావు పాల్గొన్నారు.

మందస : మండలంలోని నారాయనపురం, సరియాపల్లిలో హరిపురం పశువైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి గొరకల కేశవరరావు, బొంగు దామోదర, సివంగి మురళి, మడియా ధర్మారావు, మడియా మోహన్, జనార్ధన, విజయ్‌కుమార్, గొరకల వెంకటరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని ఊడికపాడు, యలమంచిలి గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్యలు 84 గొర్రెలకు, 56 మేకలకు నట్టల నివారణ మందులు, 1124 గొర్రెలకు, 47 మేకలకు అమ్మవారు టీకాలు, 732 కోళ్లల్లో కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేశారు. అలాగే అనారాగ్యంతో ఉన్న పశువులకు, 11 ఎదకురాని ఆవులకు, 9 చూడి పశువులకు, 6 చూడి నిలవని పశువులకు గర్భస్థ పరీక్షలు చేశారు. గతంలో వేయని పశువులకు 19 జబ్బవాపు, 14 గొంతువాపు, 24 ముద్ద చర్మవ్యాధి, 9 గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు ఎస్.వెంకటరమణ, ఎన్.శోభ పాల్గొన్నారు.

బూర్జ: దూడకు మందులు వేస్తున్న జెడి తదితరులు

పాతపట్నం : శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పలాస: పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పలాస పశుసంవర్ధకశాఖ అదనపు సంచాలకులు పోతనపల్లి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని లొద్దభద్రలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పాడి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరు : ఈ నెల 31 వరకు నిర్వహించనున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

కేక్ పంచిపెడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఘనంగా ప్రకాష్ జయంతి

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తండ్రి, ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్, కవిటి మాజీ ఎంపిపి బెందాళం ప్రకాష్ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముందుగా విప్ అశోక్ కుటుంబ సభ్యులు, టిడిపి శ్రేణులు, ప్రకాష్ అభిమానులతో కలిసి రామయ్యపుట్టుగలోని ప్రకాష్ ఘాట్ వద్ద నివాళ్లర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రగడపుట్టుగలోని వాలీబాల్ క్రీడా మైదానంలో ఉన్న ప్రకాష్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి ప్రకాష్ చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. అనంతరం విప్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, ఆరింగి మధు, కొర్రాయి వాసుదేవ్, బెందాళం తిరుమల, బాసుదేవ్‌రౌలో, బీమా రౌలో, బల్లెడ రమేష్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

'అన్న క్యాంటీన్' పరిశీలన

పలాస : కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఆకస్మికంగా మంగళవారం పరిశీలించారు. క్యాంటీన్‌లో అప్పటికే అల్పాహారం (టిఫిన్) తింటున్న ప్రజలను ఆహార నాణ్యత విషయమై వాకబ్ చేశారు. ఆహార నాణ్యతను అన్న క్యాంటీన్ వెలుపల లోపల శానిటేషన్ పరిస్థితిని సమీక్షించారు. తాగునీటి నాణ్యతను పరిశీలించారు. టిఫిన్లతో ఇచ్చే సాంబార్ నాణ్యత తక్కువగా ఉందని గుర్తించి నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. టిఫిన్లలో ఇచ్చే ఉప్మా రుచికరంగా లేదని అన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఈయనతో పాటు అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్ డి.ప్రభాకరరావు ఉన్నారు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2020-21లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంగళవారం అంతా కలిసి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా వారు చదువుకున్న పాఠశాలకు చేరుకొని నాటి గుర్తులను తలచుకొని కలిసి మెలిసి ఆటపాటలతో గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానించారు. విద్యార్థులంతా కలిసి ఫొటోలు తీసి ఒకొరికొకరు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తామాడ సాయి, బొడ్డు రేవతీపతి, మడ్డు లోహిత్, బొడ్డు ఆకాష్, తెప్పల కపిల్ తెలుకుల హేమంత్, రాజాం ఢిల్లీరావు, రాజాం శృతి, దున్న సమీర పాల్గొన్నారు.

రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

ఆమదాలవలస : ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని టిడిపి రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ రాడ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 - 24 మధ్య జిల్లా టిడిపి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల తరపున పోరాటం చేసి 2024 సాధారణ ఎన్నికల్లో టిడిపిని విజయతీరాలకు చేర్చారన్నారు. ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోకపోవడంతో కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కాళింగ సామాజిక వర్గం ప్రభుత్వంపై గుర్రుగా ఉందని, భవిష్యత్‌లో పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి పునరాలోచించి ఆయనను మంత్రివర్గంలోకి తీసుకొని సముచిత స్థానం కల్పించాలని సిఎం చంద్రబాబునాయుడును కోరారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని డొంకూరుకు చెందిన చిన్నారని సమీరా బోన్ కేన్సర్‌తో బాధపడుతుంది. మెరుగైన చికిత్స కోసం దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం అందించారు. కొద్ది నెలల క్రితం వరకు తమ తోటి స్నేహితులతో అడుతూ పడుతూ ఉన్న 9వ తరగతి చదువుతున్న సమీరకు ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించింది. దీంతో తల్లిదండ్రులు కుమార్తెను చికిత్స కోసం వైద్యులను ఆశ్రయించారు. చికిత్స అనంతరం వైద్యులు ఆమెకు బోన్ కేన్సర్ ఉందని నిర్ధారించారు. చిన్నారి వైద్యం కోసం రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఒక్కసారిగా భయాందోళన చెందారు. కుటుంబ పోషణకే ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబం చిన్నారి చికిత్స కోసం దాతలను ఆశ్రయించారు. పలువురు ముందుకొచ్చి తమ వంతు సహకారం అందిస్తున్నారు. తమ తోటి విద్యార్థులు రూ.10 వేలు, కేశుపురానికి చెందిన కాళీమాత సేవాసమితి రూ.20 వేలు, మహేశ్వర అగ్నికుల క్షత్రియ సేవా సంఘం రూ.10 వేలు, పెద్దలక్ష్మీపురం గ్రామస్తులు రూ.10వేలు, కపాసుకుద్దికి చెందిన అగ్నికులు క్షత్రియలు రూ.7వేలు, డొంకూరు గ్రామ మహిళలు రూ.28 వేలు, వాడబలిజ కులస్తులు రూ.5 వేలు, డొంకూరు యువత రూ.30 వేలు, డొంకూరు అగ్రికుల క్షత్రియలు రూ.50వేలు ఆర్థిక సాయంగా చిన్నారి తల్లిదండ్రులు అందించి చేయూతనిచ్చారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

బెహరా మనోవికాస కేంద్రంలో బాలికా దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాలికల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందని, వాటిపై పూర్తి అవగహన పెంచుకోవాలని బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్‌రైట్స్ అవేర్నెస్ ఫోరం ఆధ్వర్యాన నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో ఆయన కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు అల్పాహార విందు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఆటలు, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. మధ్యాహ్నం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ అవేర్నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి.ధనలక్ష్మి మాట్లాడుతూ తాము ఐదు రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి ఉపయుక్తంగా ఉండే వివిధ కార్యక్రమాలను రూపకల్పన చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో బాలల సంఘాల ప్రతినిధులు మెట్ట మల్లేశ్వరరావు, కొత్తకోట శ్రీనివాసరావు, మొదలవలస వాసుదేవ కుమార్, సింగూరు ప్రవీణ్, పైడి బాలకృష్ణ, బగాది ప్రవీణ్, మోహిని, పి.మాధురి, కేంద్రం నిర్వాహకులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సీతారాం

బూడిద తెగులు నివారణకు చర్యలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రైతులు రబీ సీజన్‌లో సాగుచేస్తున్న మినప, పెసర పంటలకు సోకే బూడిద తెగుళ్ల నివారణకు గ్రాము కార్బన్‌డిజమ్ మందును లీటర్ నీటిలో కలిసి, రెండు మిల్లీలీటర్లు హెక్సాకనజోల్ మందును లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలని ఎఒ ఎస్.గోవిందరావు అన్నారు. మండలంలోని వాంద్రాడలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ బూడిద తెగులు విత్తనం వేసిన 35 రోజులు తరువాత గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు వస్తుందని అన్నారు. ప్రస్తుతం వాతావరణం ఈ తెగులు వచ్చేందుకు అనుకూలంగా ఉందని, రైతులు ఈ మందులను చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ ఎస్.శివకుమార్, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ గోవిందరావు

సస్యరక్షణతో అధిక దిగుబడి

నందిగాం : సస్యరక్షణతో రబీ పైరులో అధిక దిగుబడి సాధించవచ్చునని మండల ఎఒ పి.శ్రీకాంత్ వర్మ అన్నారు. మండలంలోని హుకుంపేట, బెల్లుకోల గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు

తెలుగుకీర్తి జాతీయ పురస్కారాలు

శ్రీకాకుళం అర్బన్ : సత్కారాన్ని అందుకుంటున్న కుమార్ రాజు

రణస్థలం: విజయవాడ కౌతా పూర్ణనంద విలాస్ వేదికపై వివిధ రాష్ట్రాల వివిధ జిల్లాల్లో సాహితీ, కళారంగ లబ్ద ప్రతిష్ట కలిగిన కవి, కవయిత్రిలను, కళారంగ కళాకారులను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సంస్థ సిఇఒ డా.కత్తిమండ ప్రతాప్ జన్మదినం సందర్భంగా 143వ కార్యక్రమం రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయట్రి అకాడమి, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి, బుక్‌ఆఫ్ రికార్డ్, అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సాహిత్యంలో ప్రతిభావంతులైన వారికి తెలుగుకీర్తి జాతీయ పురస్కారాన్ని మండలంలోని కొండములగాం ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న శ్రీకాకుళం జెండా వీధికి చెందిన ప్రసిద్ధ కవి, కవితామయం అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన)ను డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, మహిళా అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, ఎస్‌పి నరసింహారావు, దూరదర్శన్ డైరెక్టర్ కొండలరావు చేతులమీదుగా జ్ఞాపిక, శాలువ, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. పురస్కారం పొందినందుకు ఆయన పనిచేస్తున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు కవితామయం ప్రధాన కార్యదర్శి జంధ్యాల శరత్‌బాబు, వివిధ సాహితీ సంస్థలు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజుకు అరుదైన గౌరవం దక్కింది. విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్‌లో మంగళవారం శ్రీశ్రీ కళావేదిక, రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయట్రీ అకాడమీ సంయుక్తంగా తెలుగుకీర్తి పురష్కారాన్ని ఆయనకు అందజేసి ఘనంగా సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తి మండ ప్రతాప్ జన్మదిన వేడుకల్లో భాగంగా సాహితీ కృషికి కుమార్ రాజుకు ఈ పురస్కారాన్ని అందించారు. దూరదర్శన్ డైరెక్టర్ కొండలరావు, డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు సమక్షంలో ఈసత్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి తదితరులు హాజరయ్యారు.

రణస్థలం : పురస్కారం అందుకుంటున్న ఈవేమన

మహిళా సాధికారతకు కృషి

ప్రజాశక్తి- పలాస

సాయిలక్ష్మి

మహిళా సాధికారతకు కృషి చేస్తానని నవభారత్ యంగ్ అడ్వకేట్, యంగ్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉమెన్ జాయింట్ సెక్రటరీ తలగాన సాయిలక్ష్మి అన్నారు. ఈ మేరకు పలాసలోని తల్లిదండ్రులను మంగళవారం కలిసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళా న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి సహాయకారిగా ఉండేందుకు ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగుతానని అన్నారు. ప్రస్తుతం విశాఖపట్నం బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొంది ఉన్నానని తెలిపారు.

రోగిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

అవగాహనతో కుష్టువ్యాధి నివారణ

కవిటి: అవగాహనతోనే కుష్ట వ్యాధి నివారణ సాధ్యమని, దీనిపైన అవసరమైన భయాలు వద్దని రాజపురం ప్రభుత్వాస్పత్రి వైద్యులు శశిధర్ అన్నారు. ఎల్‌సిడిసి సర్వేలో భాగంగా మండలంలోని గొండ్యాలపుట్టుగలో వైద్య సిబ్బంది మంగళవారం సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన నెయ్యల కృష్ణారావును అనుమానిత కేసుగా గుర్తించి నిర్ధారణ కోసం శ్రీకాకుళం పంపించారు. కార్యక్రమంలో ఎఒ అభిమన్యు సోయి, ఎఎన్ఎం ఉష, ఆశాకార్యకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

మండీల వద్దే ధాన్యం కొనుగోలు చేయాలి

పర్లాకిమిడి: మండీల వద్దే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలని గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం డిమాండ్ చేశారు. గజపతి జిల్లా కాశీనగర్ సమితి హడ్డుబంగి, ప్రధాన కూడలి వద్ద రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యాన్నీ కొనుగోలు చేయాలన్నారు. రైతులు ధాన్యాన్ని మిలర్ల వద్దకు పంపిస్తే రెండు నుంచి ఐదు కేజీలు అదనంగా తీసుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎల్.రవణయ్య, నారా కృష్ణారావు, జోసప్ గోమాంగో రైతులు పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటు

గరుగుబిల్లి: నేరాల నియంత్రణకు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అవసరమైన చోట సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ ఎస్.రమేష్‌నాయుడు తెలిపారు. గరుగుబిల్లి హనుమాన్ టెంపుల్ జంక్షన్ వద్ద మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళ వారం సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇప్పటికే మండల పరిధిలోని పలు ప్రధాన రహదారుల జంక్షన్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ప్యాకేజీతో స్టీల్‌ప్లాంట్‌కు మేలు

సీతంపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్లు ప్యాకేజీని మంజూరు చేయటం పట్ల పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కేవలం ఒక ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదని, ఇది విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల విజయం, రాష్ట్ర ప్రజల గర్వం, పట్టుదల, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల అచంచలమైన పోరాట స్ఫూర్తికి ఆమె ప్రశంసలు తెలిపారు. అలాగే పిఎం, సిఎం, డిప్యూటీ సిఎం, కేంద్రమంతులకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సమస్యలను పార్లమెంట్‌లో కంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు లేవనెత్తినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు కేవలం ఒక వారం వ్యవధిలో, సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ వంటి రెండు ప్రధాన విజయాలను కూటమి ప్రభుత్వం సాధించిందని తెలిపారు. ఆ ఐకమత్యం, సంకల్పంతో పోరాడిన ఈ విజయం ప్రతి తెలుగు వారికి సంక్రాంతి కానుకగా నిలుస్తుందని ఆమె తెలిపారు.

డీడీని కలిసిన గిరిజన నాయకులు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణిని ట్రైబల్ రైట్స్ ఫోరం రోబ్బ లోవరాజు, జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకష్ణ, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, ఆదివాసీ జెఎసి నాయకులు దుక్క సీతారాం, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్ర శేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు.